## క్లుప్తంగా

### కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతు బజార్లలో వివిధ కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాట కిలో రూ. 11, వంకాయ 23, బెండ 53, పచ్చి మిర్చి 40, కాకర 32, బీర 42, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 23–35, క్యారెట్ 15, దొండ 35–45, చిక్కుడు 45, గోకర 40, బీట్‌రూట్ 18, క్యాప్సికం 40, ఆలు 25–31, దోస 33, సార 13, పొట్ల 10, ఉల్లి 24, చామ 50 ప్రాకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

### కేలండర్ల పంపిణీ



చాదర్‌ఘాట్: ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కేలండర్లను పంపిణీ చేయటం అభినందనీయమని ఓల్డ్‌మలక్‌పేట ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం కేలండర్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలువురికి కేలండర్లు అందజేశారు. కార్యక్రమంలో నేతలు చౌకి విజయకుమార్, సందీప్‌రెడ్డి, కనకబోయిన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### మహేశ్వరంలో బీజేపీ జెండా ఎగురవేయాలి: రాధా ధీరజ్‌రెడ్డి



తరలివెళ్తున్న కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, బీజేపీ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ అర్బన్ ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో తుక్కుగూడలో నిర్వహించిన బూత్ స్థాయి సమావేశానికి ఆర్‌కేపురంలో నుంచి బీజేపీ నాయకులు, కర్యకర్తలు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జ్‌లు తరలివెళ్లారు.

### ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

మలక్‌పేట: మానవ తప్పిదాలతోనే 75 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రగతి మహిళా డిగ్రీ కాలేజ్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్ చేయకూడదని ఏసీపీ స్పష్టం చేశారు. ప్రమాదాలకు తావులేకుండా వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం.. లేకుంటే జరిగే అనర్థాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కాలేజ్ ప్రిన్సిపాల్ మంజురెడ్డి, ఉపాధ్యాయులు, మలక్‌పేట పోలీసులు పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత

అంబర్‌పేట: పార్కు స్థలంలో ఆట స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ స్థానికులు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌కు విన్నవించారు. శనివారం అంబర్‌పేట డివిజన్ సునార్‌బౌలీలో నిరుపయోగంగా ఉన్న పార్కును ఆటస్థలంగా మారిస్తే స్థానిక పిల్లలకు ప్రయోజనం ఉంటుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే సహకారంతో ఆటస్థలంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారన్నారు. స్థానికులు మహేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

### హుజూరాబాద్ బీసీ సంక్షేమ సంఘం ఇన్‌చార్జ్‌గా రామారావు

ముషీరాబాద్: హుజూరాబాద్ నియోజకవర్గం ఇల్లంతకుంట మండలం శ్రీరాములపల్లికి చెందిన రామారావును బీసీ సంక్షేమ సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ భవన్‌లో శనివారం సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య రామారావుకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలకు రాజ్యాధికారం రావడమే సంఘం లక్ష్యమని దీనికి బీసీలంతా ఒక్కటై ఉద్యమించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. గాదె గుణసాగర్, శివ, రాజ్‌కుమార్, సతీష్, సుధాకర్, మల్లేష్, నిఖిల్ తదితరులున్నారు.

# ఎల్‌బీనగర్ అభివృద్ధిపై సమీక్ష



ఎల్‌బీనగర్‌లో జరుగుతున్న పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో మాట్లాడుతున్న సత్యంచారి

- వివిధ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష
- నియోజకవర్గ రూపురేఖలు మారబోతున్నాయి
- మెరుగైన రవాణా వసతుల కల్పనే లక్ష్యం
- అభివృద్ధి పనులను ముమ్మరం చేయండి
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తయితే ఎల్‌బీనగర్ రూపురేఖలు ఎవరూ ఊహించని విధంగా మారబోతున్నాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఫ్లై ఓవర్, జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్ పనులపై జీహెచ్ఎంసీ, ఎస్ఆర్‌డీపీ ఇంజినీరింగ్ అధికారులతో శనివారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ నెల చివరి నాటికి చింతల్‌కుంట నుంచి మాల్ మైసమ్మ దేవాలయం వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.
- అలేఖ్య టవర్ వద్ద నిర్మిస్తున్న బైరామల్‌గూడకు వెళ్లే ఫ్లై ఓవర్ ఒకటి, చింతలకుంటకు వెళ్లే ఫ్లై ఓవర్ ఆగస్టు వరకు పూర్తి చేయాలని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఫ్లై ఓవర్ పనులను పూర్తి చేసేందుకు స్థల సేకరణకు అటంకం కలుగుతోందని అధికారులు పేర్కొనగా సమస్యను తాను పరిష్కరిస్తానని పనులలో వేగం పెంచాలని తెలిపారు.
- ఎల్‌బీనగర్ నుంచి నాగోల్, ఎల్‌బీనగర్ నుంచి మంద మల్లమ్మ వరకు జరిగే జంక్షన్ ఇంప్రూవ్‌మెంట్‌లపై దృష్టి పెట్టాలని సూచించారు.
- ఇక్కడ జరుగుతున్న పనులు పూర్తి అయితే ఎల్‌బీనగర్ రూపురేఖలు మారనున్నాయని దీంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించినవారము అవుతామని ఆయన స్పష్టం చేశారు.
- సమావేశంలో జోనల్ కమిషనర్ పంకజ, ఎస్ఈ అశోక్‌రెడ్డి, మూడు సర్కిళ్ల ఈఈలు కోటేశ్వరావు, రమేష్‌బాబు, శ్రీనివాస్, డీఈలు దామోదర్‌రావు, కనకయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే దేవిరెడ్డి**

హస్తినాపురం: నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు అందోజు సత్యంచారి కలిశారు. డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... హస్తినాపురం డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి

- ఎల్‌బీనగర్‌లో కాషాయ జెండా రెపరెపలాడాలి
- బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి

నాగోలు: భారతీయ జనతా పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరేయాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామరంగారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీజేపీ పోలింగ్ బూత్ కమిటీ సభ్యుల సమ్మేళనం నాగోలు శుభం కన్వెన్షన్‌లో నిర్వహించారు. బూత్ కమిటీలతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వర్చువల్‌గా మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సామ రంగారెడ్డి మాట్లాడుతూ... బీజేపీని బలోపేతం చేయడంతోపాటు కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ ఎనిమిదేళ్ల పాలనలో పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశారని విమర్శించారు. ఉప ఎన్నికలు వచ్చిన ప్రాంతంలోనే ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని ఇతర ప్రాంతాలను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి పోర్టల్ సరిగా లేదని సామ రంగారెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం బతకాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనం ఉందని పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నుంచి బీజేపీ పటిష్టం చేసి వచ్చే ఎన్నికల్లో గోల్కొండ కోట మీద బీజేపీ జెండా ఎగరేస్తామని తెలిపారు. రాష్ట్రంలో నోటిఫికేషన్లు ఇచ్చారే తప్ప ఒక్క ఉద్యోగాన్నీ భర్తీ చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీకి వీఆర్ఎస్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ నాయకులు పేరాల శేఖర్‌జీ మాట్లాడుతూ... ఢిల్లీ నుంచి గల్లీ దాకా కార్యకర్తలను అనుసంధానించడమే లక్ష్యంగా సరళ్ యాప్‌ను ఆవిష్కరించామని తెలిపారు. బూత్ కమిటీలు పూర్తి చేసి ప్రతి గల్లీలో బీజేపీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ శాఖ ఇంచార్జ్ రాజశేఖర్‌రెడ్డి, బండారి భాస్కర్, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, నాయకులు కటకం నర్సింగ్‌రావు, చింతల సురేందర్ యాదవ్, కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, రంగ నర్సింహగుప్తా, బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నవజీవన్‌రెడ్డి, మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామ రంగారెడ్డి

## విద్యతోనే ఉజ్వల భవిత

**బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి**

ఎల్‌బీనగర్: విద్యార్థులు చదువులో రాణించి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని.. విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దులచ్చిరెడ్డి అన్నారు. సాహెబ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో శనివారం తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన సౌజన్యంతో రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులకు తరుచూ ప్రతిభ పోటీలను నిర్వహించడం వలన వారికి చదువులపై మంచి పట్టు సాధిస్తారన్నారు. గురువులు బోధించిన పాఠ్యాంశలను శ్రద్ధగా విని తమలో దాగి ఉన్న ప్రతిభలను వెలికితీయాలని పేర్కొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు స్వయంగా రూ. 5000ల బహుమతులను అందించారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేష్, రామచంద్రారెడ్డి, లీలా ప్రభాకర్‌రెడ్డి, లలిత, నాయకులు రాజిరెడ్డి, రఘురాంనేత, సంగమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా గాంధీనాయక్



నియామక పత్రాన్ని అందుకుంటున్న గాంధీనాయక్

మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన కర్నావత్ గాంధీనాయక్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ ఆర్.జగన్‌లాల్ జారీ చేసిన నియామక ఉత్తర్వులను కేంద్ర మంత్రి మాజీ బలరామ్‌నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ చేతుల మీదుగా శనివారం గాంధీనాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీనాయక్ మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాటానికి తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణలో బీజేపీకి అధికారం తథ్యం

సైదాబాద్: నిత్యం ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యలు పరిష్కరిస్తూ, కార్యకర్తలు పార్టీ పటిష్టతకు కృషి చేస్తే రానున్న ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావటం ఖాయమని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని భారత్ ఫంక్షన్‌హాల్‌లో యాకత్‌పురా నియోజకవర్గ బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కార్యకర్తలు, నాయకులు వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మేరా బూత్ మజుబూత్ అనే నినాదంతో పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్టం చేయడానికి అందరూ కృషి చేయాలన్నారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ధీరజ్, కార్పొరేటర్‌లు జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, సహదేవ్‌యాదవ్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంగం మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలె భాస్కర్‌రాజ్

### ముగ్గుల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులను ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు, ఎన్జీవోస్ కాలనీలోని లైబ్రరీ గ్రౌండ్ వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలో ఆకర్షణీయంగా ముగ్గుల వేసిన మహిళలకు శనివారం సాయంత్రం బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వచ్చే సంవత్సరం నిర్వహించే ముగ్గుల పోటీలకు బహుమతులకు రూ. 10 వేలను విరాళంగా ప్రకటించారు. నిర్వాహకులు మూర్తి, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పేద బ్రాహ్మణ యువతి వివాహానికి చేయూత



మల్లికారాణికి పుస్తె, మెట్టెలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: పేద ప్రజలకు నిరంతరం ఉప్పల ఫౌండేషన్ చేయూతనందిస్తోందని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శనివారం కొత్తపేట డివిజన్ మారుతీనగర్‌కు చెందిన నిరుపేద బ్రాహ్మణ యువతి మల్లికారాణి వివాహం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలసి మల్లికారాణి నాగోల్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా క్యాంప్ కార్యాలయానికి వచ్చి కలిశారు. ఈ సందర్భంగా వారికి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా చేతుల మీదుగా మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులు విరాళంగా అందజేశారు.

## ఉన్నతాశయంతో ముందుకు సాగాలి

దిల్‌సుఖ్‌నగర్: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదని, నేటితరం యువతకు ఈ స్ఫూర్తి మరింత అవసరమని ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రా అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని అవినాష్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యా, వ్యాపారం, ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ ఆవిష్కరణలలో ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అజయ్ మిశ్రా మాట్లడుతూ... చదువుకొనే రోజుల్లోనే ఉన్నతాశయంతో ముందుకు సాగడమే కాకుండా లక్ష్య సాధనకు అహర్నిశలు శ్రమిస్తే అద్భుతాలు సాధించవచ్చని తెలిపారు. సమాజంలో విద్యాకు ఎంతో ప్రాధాన్యం ఉందని, విద్యార్థులు పట్టుదలతో ఉన్నత చదువులు చదివి తమ భవిష్యత్‌ను బంగారుమయంగా మలుచుకోవాలని సూచించారు. ఐటీ, మార్కెటింగ్, హెచ్‌ఆర్, ఫైనాన్స్ స్ట్రీమ్‌లోకి టెక్నికల్ సెషన్లకు గీతం విశ్వవిద్యాలయం నుంచి దేవికారాణిశర్మ, ఆరోరా పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శుభప్రద అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర, శివశివాణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ రమణరావు, సీఈఓ ఎడ్యుకేషన్ కనెక్ట్ శివతాండు, నరేంద్రనాథ్, సుశీలకందూరి, నీతూసచ్‌దేవా, ప్రవీణ్‌కుమార్, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





సదస్సులో పాల్గొన్న అజయ్ మిశ్రా తదితరులు

## సీఎం సహాయ నిధి పేదలకు వరం



చెక్కు బాధితులకు అందజేస్తున్న నాగేష్, అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదని బీఆర్ఎస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన పర్వతాలు కూతురు యువశ్రీ జీర్ణకోశ సమస్యతో బాధ పడుతూ శాస్త్ర చికిత్స చేయించుకోగా ఆర్థిక ఇబ్బందులతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సంప్రదించారు. సబితా ఇంద్రారెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధికి సిపారు చేయగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 60 వేలు మంజూరైంది. ఈ చెక్కును శనివారం బాధితుల కుటుంబ సభ్యులకు నగేష్, అరవింద్ శర్మ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాజిద్, సిద్దగోని వెంకటేష్, ఊర్మిళారెడ్డి, మురళీధర్‌రెడ్డి, మహేష్, రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

**బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి**

మలక్‌పేట: రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం సలీంనగర్‌లోని సఫైర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మలక్‌పేట నియోజవర్గ ×బూత్ మహా సమ్మేళన్€ కార్యక్రమానికి అసెంబ్లీ పాలక నూలక నర్సింహారెడ్డి, అసెంబ్లీ ప్రభారి కపిలవాయి రవీందర్, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి ప్రసంగించారు. కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రతి వ్యక్తినీ కలిసి బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలు, వైఫల్యాలు ప్రజలకు వివరించి చైతన్యం చేయాలన్నారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెడుతున్న కేసీఆర్ పాలనకు చరమగీతం పాడటం ఖాయమన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బూత్ స్థాయి కార్యకర్తలకు మార్గదర్శనం చేశారు. సమావేశంలో కోశాధికారి రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దేవేందర్, మలకోపేట కన్వీనర్ నవీన్‌రెడ్డి, రాంకోటేశ్వర్‌రావు, సుభాష్‌చందర్, డివిజన్ల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, మోర్చా విభాగం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

## ఇష్టపడి చదివితేనే లక్ష్యసాధన



వెంకటరమణకాలనీ రవీంద్ర భారతి పాఠశాల వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాణికుముదిని, చిత్రంలో సెంట్రల్ జోన్ డీసీపీ రాజేష్‌చంద్ర

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ వెంకటరమణకాలనీలోని రవీంద్ర భారతి పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం రాత్రి లలిత కళా తోరణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఐ.రాణికుముదిని, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.రాజేష్‌చంద్ర జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాని సాధనకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఇష్టపడి చదివితే తమ లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని స్పష్టం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జోనల్ ఇన్‌చార్జి బాబూరావు, ఏజెడ్ఐ కిషోర్, జోనల్ డీస్ జ్యోతి, డీఐ దయాకర్, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న కర్మన్‌ఘాట్ స్కూల్ విద్యార్థులు

**కర్మన్‌ఘాట్ స్కూల్‌లో...**

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని కర్మన్‌ఘాట్ రవీంద్రభారతి స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జోన్ ఇంచార్జి బాబూరావు, కిషోర్, డీఐ క్రాంతికుమార్, డీస్ ప్రమీల ప్రిన్సిపాల్ కుముదవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థి అదృశ్యం



దేవేందర్

హస్తినాపురం: సూర్యపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి తల్లిదండ్రులను చూసేందుకు నగరానికి వచ్చి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... సూర్యాపేట పట్టణం ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన ప్రమీల, రూబెన్ దంపతులు 20 రోజుల క్రితం బతుకు దెరువుకోసం నగరానికి వచ్చి చింతలకుంటలో నివాసం ఉంటూ వాచ్‌మెన్‌గా దూబెన్, ప్రమీల ఇళ్లలో పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వారం క్రితం వారి కుమారుడు దేవేందర్(17) నగరానికి వచ్చాడు. నూతన సంవత్సరాల వేడుకల అనంతరం ఈ నెల 2వ తేదీ ఇంటికి రాకపోవడంతో కంగారు చెందిన తల్లిదండ్రులు తెలిసిన వారిదగ్గర దేవేందర్ గురించి వెతికినా ఫలితం లేదు. దీంతో తండ్రి రుబీన్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.